# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :279 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి గురువారం 15 అక్టోబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :279 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI THU 15 OCTOBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## జనసేనలో చేరిన వంగవీటి రాధా..
### విజయవాడ మేయర్ రేసులో ఉంటారా?



- కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కల్యాణ్
- విజయవాడ మేయర్ రేసులో రాధా పేరు
- జనసేనలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్
- విజయవాడలో 35 డివిజన్లు జనసేన కోరుతున్నట్లు సమాచారం
- కూటమి సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు

పెన్ పవర్ డెస్క్:మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు.

- మిగతా 2లో

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల..
### మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు




**ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.**



పెన్ పవర్ డెస్క్: ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది.తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు (ఖుాదీ) ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కుముడులు వీడి, ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది.



### బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న
## రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు
- గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ప్రముఖులు
- ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్న రాష్ట్రపతి
- దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను ఆప్యాయంగా పలకరించిన ముర్ము

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో

- మిగతా 2లో



### విజయనగరం జడ్పీ రేసులో
## బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

- టీడీపీలోకి వెళ్లిన మేనల్లుడు చిన్న శ్రీనుకు చెక్ పెట్టే వ్యూహం
- బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో మారిన సమీకరణాలు
- చిన్న శ్రీను కూడా తన కుమార్తెను బరిలోకి దించనున్నట్లు ప్రచారం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విజయనగరం జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా జెడ్పీ చైర్‌పర్సన్ పీఠం కోసం వైసీపీ కొత్త వ్యూహానికి పదును పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే వైసీపీని వీడి టీడీపీలో చేరిన తన మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కి రాజకీయంగా చెక్ పెట్టేందుకు,

- మిగతా 2లో

## ప్రజాబలంపై కాదు.. పోలీసు బలంపై ఆధారపడ్డారు

- స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం పోలీసులను వాడుకుంటోందని కన్నబాబు ఆరోపణ
- కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అభ్యర్థులను అడ్డుకుంటున్నారని విమర్శ
- వైసీపీ కార్యకర్తలపై పాత కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపాటు

- మిగతా 2లో



### జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం..
## ఇక రోజువారీ విచారణ

- జగన్ ఈడీ కేసులపైనా ఇక రోజువారీ విచారణ
- విచారణ వేగవంతం చేయాలని సీబీఐ కోర్టు నిర్ణయం
- జగన్‌తో పాటు 70 మంది నిందితుల వ్యక్తిగత విచారణ
- పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 9 ఈడీ ఛార్జిషీట్లు

పెన్ పవర్ డెస్క్:మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై ఉన్న సీబీఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

- మిగతా 2లో



## ఢిల్లీలో అక్టోబర్ 16న ‘తిరంగా’ నిరసన..
### కొత్త ఆందోళనకు అభిజీత్ దీప్కే పిలుపు

- సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం
- నిరసనకు ‘లెహ్రా దో తిరంగా’ పేరు
- సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాల అరెస్టుకు నిరసనగా కార్యక్రమం
- అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
- స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే పిలుపు



పెన్ పవర్ డెస్క్:తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక

- మిగతా 2లో



### జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం..
## ముగ్గురు భారతీయుల సజీవ దహనం

- జర్మనీలోని బోచుమ్ నగరంలో ఘోర అగ్నిప్రమాదం
- ఘటనలో ముగ్గురు భారతీయులు మృతి
- మృతుల్లో ఇద్దరు యువతులు, ఒక యువకుడు
- ఐదుగురికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- హత్య అనుమానంతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్:జర్మనీలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. బోచుమ్ నగరంలోని

- మిగతా 2లో

## పాక్ సహా 31 దేశాల పైలట్లపై ‘ఎయిర్ ఫ్రాన్స్’ నిషేధం

- ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో 31 దేశాల సిబ్బందిపై నిషేధం
- ఇజ్రాయెల్ నిబంధనలను పాటిస్తున్నట్లు ప్రకటించిన ఎయిర్ ఫ్రాన్స్
- ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం తర్వాత కఠిన నిర్ణయం
- ఈ నిర్ణయం ఫ్రెంచ్ ఉపాధి చట్టాలకు విరుద్ధమంటూ ఆందోళనలు

- మిగతా 2లో






### భారత్ ఎదుగుదలను మేమే
## పరిమితం చేసుకోలేం

పెన్ పవర్ డెస్క్:భారత్‌ను ‘మధ్యస్థాయి శక్తి’ అని పిలవడం సరికాదని, ఆ నిర్వచనంతో దేశాన్ని పరిమితం చేసినట్లు అవుతుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. తాము మధ్యస్థ శక్తి కాదని, ‘మధ్యలో ఉన్న శక్తి’ అని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం ‘బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ

- మిగతా 2లో

## భారత్‌తో సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి
### కెనడా విదేశాంగ మంత్రి



- నిజ్జర్ హత్య తర్వాత భారత్‌తో సంబంధాలు మెరుగుపడ్డాయన్న మంత్రి
- ఖలిస్థానీ నినాదాలపై సమతుల్యం పాటించాల్సి ఉందన్న అనితా ఆనంద్
- బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా గుర్తించిన కెనడా ప్రభుత్వం
- డిసెంబర్‌లో కెనడాలో ప్రధాని మోదీ పర్యటించే అవకాశం

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## పరిమితి పాతాళంలో.. ఖర్చు ఆకాశంలో..
# పొంతన లేని ఎన్నికల ఖర్చులు

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల వాతావరణం అలుముకుంది. నోటిఫికేషన్ విడుదలకు ముందు ఎన్నికల కమిషన్ ఒక్కొక్క పని చక్కబెడుతోంది. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయగా, జడ్పీ, మండలాలు, పంచాయతీలకు ఈ రోజు సాయంత్రం కల్లా రిజర్వేషన్లు ఖరారు కానున్నాయని అంటున్నారు. ఇక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై పరిమితి విధిస్తూ ఎన్నికల సంఘం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. అయితే ఎన్నికల సంఘం విధించే పరిమితులకు వాస్తవంగా అయ్యే ఖర్చుకు ఎక్కడా పొంతన ఉండటం లేదని చెబుతున్నారు. ఎన్నికలు అంటేనే ధన బలం ఎక్కువగా చూపాల్సి వుంటుందని అంటున్నారు. ఎన్నికలలో డబ్బు దుర్వినియోగం కాకుండా, ప్రలోభాలకు అవకాశం ఇవ్వకుండా ఎన్నికల సంఘం నిఘా వేసిన అదంతా తూతూ మంత్రంగానే ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై పరిమితులు ఆసక్తి రేపుతున్నాయి. పది వేల జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచులు రూ.2.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.50 వేలు ఖర్చు చేయాల్సివుంటుందని అంటున్నారు. అదే సమయంలో పది వేల కన్నా ఎక్కువ జనాభా ఉండే పంచాయతీల్లో సర్పంచులు రూ.4 లక్షలు, వార్డు సభ్యులు లక్ష చొప్పున ఖర్చు చేసుకోవచ్చునని ఎన్నికల సంఘం సూచించింది. అదే సమయంలో జడ్పీటీసీ అభ్యర్థులు రూ.8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.4 లక్షలు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు రూ.20 లక్షలు, కౌన్సిలర్లు రూ.7.5 లక్షలు, విశాఖ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి 40 లక్షలు, ఇతర కార్పొరేషన్లలో మేయర్ అభ్యర్థులు 25 లక్షలు, కార్పొరేటర్లు విశాఖలో రూ20 లక్షలు, ఇతర ప్రాంతాల్లో రూ.10 లక్షల చొప్పున ఖర్చు చేయాల్సివుంటుంది. అయితే ఎన్నికల సంఘం విధించిన ఈ పరిమితి ఏమూలకూ చాలదని, నామినేషన్ వేయడానికి ముందే ఈ ఖర్చులు అయ్యే పరిస్థితి ఉందని అంటున్నారు. ఎన్నికలు అంటేనే ధన ప్రవాహం ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి పనికి డబ్బు ఖర్చు చేయాల్సివుండటం, డబ్బు పెట్టకపోతే కనీసం ఒక్క కార్యకర్త కూడా పలికే అవకాశం లేకపోవడంతో పోటీ చేసే అభ్యర్థులు భారీగా వెచ్చించాల్సివుంటుందని అంటున్నారు. నామినేషన్ వేసేటప్పుడు జన సమీకరణ నుంచి వారికి భోజనాలు, మద్యం పంపిణీతో కలుపుకుంటే తొలిరోజే మున్సిపల్ కార్పొరేషన్లలో కోట్లలో ఖర్చు చేయాల్సివుంటుందని అంటున్నారు. కనీసం ప్రతి కార్యకర్తకు రూ.500 నుంచి ఇచ్చుకోవాల్సివుంటుందని అంటున్నారు. ఇక ఎన్నికల ముగిసే వరకు కార్యకర్తలను ప్రసన్నం చేసుకోడానికి ఓటరు దేవుడిని ఆకట్టుకోడానికి డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని అంటున్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో రూ.40 లక్షల వరకు ఖర్చు చేయొచ్చని ఎన్నికల సంఘం పరిమితి విధించగా, ఇక్కడ దాదాపు 40 కోట్ల కంటే ఎక్కువే ఖర్చు అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అదేవిధంగా విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, కడప, కర్నూలు వంటి నగరాల్లోనూ ఖర్చు కోట్లపైనే ఉంటుందని అంటున్నారు. మేయర్, చైర్మన్ అభ్యర్థులను ప్రత్యక్ష పద్దతిలో ఎన్నుకోవడం వల్ల డబ్బు మరింత ఖర్చు పెట్టాల్సివుంటోందని అంటున్నారు. గతంలో ఈ పదవులకు పరోక్ష విధానంలో ఎన్నికలు జరిగేవని, దీనివల్ల కౌన్సిలర్ అభ్యర్థులు స్థానికంగా మేనేజ్ చేసుకుని కాస్త తక్కువ ఖర్చుతో బయటపడేవారని చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ సారి ప్రత్యక్ష విధానంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల మేయర్, చైర్మన్ పదవులకు ప్రతిష్ఠ పెరిగిందని, ఐదేళ్లు పదవిలో ఉండే అవకాశం ఉండటం వల్ల అభ్యర్థులు కూడా తమ వ్యక్తిగత పరువు ప్రతిష్టల కోసం ఎక్కువ ఖర్చు పెట్టే అవకాశం ఉందని అంటున్నారు.

## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న
# రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- మొదటి పేజి తరువాయి
అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# జనసేనలో చేరిన వంగవీటి రాధా..

- మొదటి పేజి తరువాయిది
ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది. విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, మేయర్ సీటును కూటమిలో జనసేనకు కేటాయిస్తారా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి రాధాకృష్ణ కృషి చేశారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత టీడీపీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, జడ్పీ ఛైర్మన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్‌లు విడుదల చేసింది. ఈ తరుణంలో రాధా చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది. స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్ సమావేశమయ్యారు. విజయవాడలోని 86 డివిజన్లలో 35 స్థానాలు తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు సమాచారం. అయితే, 15 స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల పంపకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

# ప్రజాబలంపై కాదు..
# పోలీసు బలంపై ఆధారపడ్డారు

ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజాబలంపై కాకుండా పోలీసుల శక్తిపై ఆధారపడిందని వైసీపీ ఆరోపించింది. వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకునేందుకు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి కురసాల కన్నబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజాబలం లేకే చంద్రబాబు ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది. వైసీపీ తరఫున పోటీ చేయాలనుకుంటున్న వారిని బెదిరిస్తున్నారు. పాత కేసులు తిరగదోడి, బైండోవర్ల పేరుతో ఉదయం నుంచి రాత్రి వరకు పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టి వేధిస్తున్నారు. కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో కావాలనే జాప్యం చేస్తున్నారు" అని ఆరోపించారు. క్వాంటం కంప్యూటింగ్ గురించి మాట్లాడే ప్రభుత్వం, క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఒక యాప్‌ను సరిగా నడపలేకపోతోందా అని ఆయన ప్రశ్నించారు. 24 గంటల్లో మాన్యువల్‌గా సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పూర్తిగా వెబ్‌కాస్టింగ్ చేయాలని, సున్నితమైన ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరించాలని కన్నబాబు డిమాండ్ చేశారు. వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల కేటాయింపులోనూ అవకతవకలు జరిగాయని, ఇవి ప్రజల సౌలభ్యం కోసం కాకుండా అధికార పార్టీకి అనుకూలంగా జరిగాయని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, జగన్ నాయకత్వంలో ప్రతి వార్డులోనూ పోటీ చేసి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# విజయనగరం జడ్పీ రేసులో బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

- మొదటి పేజి తరువాయి
సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన కుమార్తె బొత్స అనూషను రంగంలోకి దించాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఈసారి బీసీ (మహిళ)కు రిజర్వ్ చేశారు. ఇదే ఇప్పుడు రాజకీయ సమీకరణాలకు కేంద్ర బిందువుగా మారింది. గతంలో వైసీపీ తరఫున జెడ్పీ చైర్మన్‌గా ఉన్న చిన్న శ్రీను, ఇప్పుడు టీడీపీ కూటమి తరఫున తన కుమార్తె సిరి సహస్రను బరిలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను దూకుడుకు కళ్లెం వేయాలంటే, బొత్స కుటుంబం నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని వైసీపీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వృత్తిరీత్యా డాక్టర్ అయిన బొత్స అనూషను చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బొత్స అనూష భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒకవేళ పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఆమె విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ బరిలో నిలవడం ఖాయమని చెబుతున్నారు. ఇదే జరిగితే విజయనగరం జెడ్పీ ఎన్నికల పోరు, బొత్స కుటుంబ సభ్యుల మధ్య ప్రత్యక్ష పోరుగా మారి రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించడం ఖాయం.

# ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..

- మొదటి పేజి తరువాయి
ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెహ్రావో దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

**ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ**

మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

# జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం..
# ముగ్గురు భారతీయుల సజీవ దహనం

- మొదటి పేజి తరువాయి
ఓ నివాస భవనంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటనపై హత్య అనుమానంతో పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బోచుమ్‌లోని హోఫ్‌స్టెడ్ జిల్లాలో ఉన్న ఓ నివాస భవనంలో మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం భవనంలోని రెండో అంతస్తులో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ముగ్గురి మృతదేహాలను గుర్తించారు. మృతులను 25, 27 ఏళ్ల వయసున్న ఇద్దరు యువతులుగా, 26 ఏళ్ల యువకుడిగా గుర్తించారు. వీరంతా భారతీయులని అధికారులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో పొగ పీల్చడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన మరో ఐదుగురిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే గాయపడిన వారి జాతీయతకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం అదే భవనంలో నివసించే 41 ఏళ్ల రొమేనియా దేశస్థుడిని హత్య అనుమానంతో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

## జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం..
# ఇక రోజువారీ విచారణ

- మొదటి పేజి తరువాయి
(ఈడీ) కేసులను కూడా రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుల్లో జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై దాదాపు దశాబ్దకాలంగా 9 ఈడీ ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజోగయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.

# భారత్‌తో సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి

ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత తీవ్రంగా దెబ్బతిన్న భారత్–కెనడా ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పుడు మళ్లీ గాడిన పడుతున్నాయని, క్రమంగా బలపడుతున్నాయని కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ అన్నారు. ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య సంబంధాలలో చోటుచేసుకుంటున్న ఈ మార్పును ఆమె ఒక "ఆహ్వానించదగ్గ పరిణామం"గా అభివర్ణించారు.

వాణిజ్యం, పర్యాటకం, విద్య వంటి రంగాల్లో ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు చాలా లోతుగా, బలంగా ఉన్నాయని ఆనంద్ తెలిపారు. రాబోయే దశాబ్దంలో అమెరికాయేతర దేశాలతో వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని కెనడా లక్ష్యంగా పెట్టుకుందని, ఈ నేపథ్యంలో 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో ఆరవ అతిపెద్ద శక్తిగా ఉన్న భారత్ తమకు ఎంతో ముఖ్యమని ఆమె నొక్కిచెప్పారు. నిజ్జర్ హత్య ఉదంతంపై మాట్లాడుతూ.. కెనడా గడ్డపై ఒక కెనడా పౌరుడి హత్యకు సంబంధించిన కేసులో న్యాయపరమైన విచారణ కొనసాగుతోందని ఆమె స్పష్టం చేశారు. చట్టబద్ధ పాలన, దేశీయ భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భారత ప్రభుత్వంతో చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని, ఇందులో భాగంగానే 'బిష్ణోయ్ గ్యాంగ్'ను ఉగ్రవాద సంస్థగా గుర్తించామని వెల్లడించారు. కెనడాలో నిరసనల సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు, ఇందిరా గాంధీ హత్యను ప్రస్తావించడం వంటి ఘటనలపై అడిగిన ప్రశ్నకు.. కెనడాలో భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రజా భద్రతకు మధ్య సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందని బదులిచ్చారు. ఈ అంశాన్ని దేశ ప్రజా భద్రత, న్యాయశాఖ మంత్రులు పర్యవేక్షిస్తున్నారని, తన దృష్టి అంతా విదేశీ సంబంధాలపైనే ఉందని ఆమె వివరించారు.

కెనడా ప్రధాని మార్క్ కార్నీ, భారత ప్రధాని నరేంద్ర మోదీతో తన సంబంధానికి ఎంతో విలువ ఇస్తారని అనితా ఆనంద్ చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో కెనడా పర్యటనకు రానున్న ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు తాము ఎదురుచూస్తున్నామని ఆమె వెల్లడించారు. ఇప్పటికే ఇరు దేశాల రాయబార కార్యాలయాలను బలోపేతం చేశామని, ఇరు దేశాల నేతలు క్రమం తప్పకుండా సమావేశమవుతూ సంబంధాలను మెరుగుపరుస్తున్నారని గుర్తుచేశారు.

## పాక్ సహా 31 దేశాల పైలట్లపై 'ఎయిర్ ఫ్రాన్స్' నిషేధం

ఇజ్రాయెల్‌కు వెళ్లే తమ విమానాల్లో పనిచేసే సిబ్బంది విషయంలో ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలను పాటించనున్నట్లు ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఫ్రాన్స్ ధృవీకరించింది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని పాకిస్థాన్ సహా 31 దేశాలకు చెందిన పైలట్లు, క్యాబిన్ సిబ్బందిని తమ దేశంలోకి అనుమతించబోమని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎయిర్ ఫ్రాన్స్ తన సిబ్బందికి సమాచారం అందించింది.

ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న భద్రతా సంఘటనే ఈ కఠిన నిబంధనలకు దారితీసింది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని ఒమన్‌కు చెందిన సహ పైలట్ హైజాక్ చేసేందుకు యత్నించిన విషయం తెలిసిందే. బెన్ గురియన్ విమానాశ్రయాన్ని ఢీకొట్టేందుకు ప్లాన్ చేశాడని, ఈ క్రమంలో భారత కెప్టెన్‌పై దాడి చేశాడని తెలిసింది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే ఇజ్రాయెల్ రవాణా మంత్రిత్వ శాఖ విదేశీ విమానయాన సంస్థలకు ఓ ఆదేశం జారీ చేసింది. పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా, అల్జీరియా, ట్యూనీషియా, ఒమన్ వంటి 31 ముస్లిం మెజారిటీ దేశాల జాతీయత లేదా ద్వంద్వ పౌరసత్వం ఉన్న సిబ్బందిని ఇజ్రాయెల్‌కు వచ్చే విమానాల్లో నియమించవద్దని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను పాటించకపోతే సంస్థతో పాటు ఉద్యోగులు కూడా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎయిర్ ఫ్రాన్స్ తన అంతర్గత మెమోలో పేర్కొన్నట్లు సమాచారం. అయితే, ఎయిర్ ఫ్రాన్స్ నిర్ణయం ఫ్రాన్స్‌లో న్యాయపరమైన చిక్కులకు దారితీసే అవకాశం ఉంది. జాతీయత లేదా మతం ఆధారంగా వివక్ష చూపడాన్ని ఫ్రెంచ్ ఉపాధి చట్టాలు నిషేధిస్తున్నాయి. ఇది ఆ దేశ చట్టాలకు విరుద్ధమని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు దేశ భద్రత దృష్ట్యా తన గగనతలాన్ని నియంత్రించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉన్నప్పటికీ, ఈ నిబంధనలను అమలు చేయడం వల్ల విమానయాన సంస్థలు తమ సొంత దేశాల్లో న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఈ నిబంధనల వల్ల విమానయాన సంస్థల సిబ్బంది షెడ్యూలింగ్‌పై ఎలాంటి ప్రభావం పడుతుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

# భారత్ ఎదుగుదలను మేమే పరిమితం చేసుకోలేం

- మొదటి పేజి తరువాయి
ఫోరమ్'లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌ను మధ్యస్థ శక్తిగా ఎందుకు అభివర్ణించకూడదు అని అడిగిన ప్రశ్నకు జైశంకర్ బదులిస్తూ, "ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా, సుమారు నాలుగు ట్రిలియన్ డాలర్ల జీడీపీతో, భవిష్యత్తులో అపారమైన అభివృద్ధి అవకాశాలు ఉన్న దేశానికి 'మధ్యస్థాయి శక్తి' అనే వర్ణన సౌకర్యంగా ఉండదు. ఆ నిర్వచనంతో మనల్ని మనమే పరిమితం చేసుకున్నట్లు అవుతుంది" అని వివరించారు. ఇతరులకు సాధికారత కల్పించే దేశాలనే మధ్యస్థ శక్తులుగా ప్రధాని మోదీ అభివర్ణించారని, కానీ భారత్ విషయంలో ఈ నిర్వచనం సరిపోదని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రపంచం కేవలం మధ్యస్థాయి శక్తులతోనే కాకుండా ఇతర దేశాలపై ఒత్తిడి తెచ్చే సాధనాలతో నిండి ఉందని జైశంకర్ విశ్లేషించారు. "ఆర్థిక ఆంక్షలు, ఫైనాన్స్ వంటి అంశాలను కూడా ఇప్పుడు అస్త్రాలుగా వాడుకుంటున్నారు. ఇది ప్రపంచాన్ని మరింత సంక్లిష్టంగా మారుస్తోంది" అని ఆయన అన్నారు. భవిష్యత్తులో పోటీ స్వరూపం మారనుందని జైశంకర్ అభిప్రాయపడ్డారు. ప్రతి దేశం తమ బలాలు, వనరులతో చర్చలకు వస్తుందని, పరస్పర అవసరాల ఆధారంగా ఒప్పందాలు ఉంటాయని అన్నారు. "చర్చల్లో ఎవరు ఎక్కడ కూర్చుంటారు, ఎవరు గట్టిగా మాట్లాడతారు అనే విషయాలు మారుతాయి. ఈ మార్పుల గురించి నిరాశావాద దృక్పథం అవసరం లేదు" అని ఆయన భవిష్యత్ ప్రపంచ తీరును అంచనా వేశారు.

# విజయవాడ ఇంద్రకీలాద్రిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అమ్మవారి దర్శనం

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 15,**
ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. శ్రీ మహా చండీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు రాష్ట్రపతికి వేద ఆశీర్వచనం అందించారు.




# ఈ నెల 28న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు కమిషనర్ కె. మయూర్ అశోక్

**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్ 14,**
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కె. మయూర్ అశోక్ తెలిపారు. అక్టోబర్ 14 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 19న నామినేషన్ల పరిశీలన, 21న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
ఎన్నికలుపారదర్శకంగా,ప్రజాస్వామ్యబద్ధంగా






నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని, ఓటర్లందరూ తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకుని ఎన్నికల విజయవంతానికి సహకరించాలని కమిషనర్ కోరారు.

# బాలికల హక్కుల పరిరక్షణ అందరి సమిష్టి బాధ్యత: జిల్లా న్యాయ సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్

**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 14:**
బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, గౌరవం, సమానత్వం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సంస్థ చైర్మన్ బి. సాయి కల్యాణ చక్రవర్తి ఆదేశాలతో బుధవారం గుంటూరులో అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ జియాఉద్దీన్ మాట్లాడుతూ.. ఒక బాలిక చదువుకుంటే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, బాలిక సాధికారత సాధిస్తే సమాజం పురోగమిస్తుందని పేర్కొన్నారు. బాలికల విద్య, భద్రత, స్వేచ్ఛ, సమానత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులని తెలిపారు. బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, బాల కార్మికత్వం, అక్రమ రవాణా, లింగ వివక్ష, సామాజిక మాధ్యమాల్లో వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలు తమ సమస్యలను భయపడకుండా చెప్పగలిగే వాతావరణాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కల్పించాలని సూచించారు. బాధిత బాలికలను నిందించకుండా వారికి అండగా నిలిచి, అవసరమైన రక్షణ, న్యాయ సహాయం అందించాలని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం, చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి విజయ్ కుమార్, ప్యానెల్ న్యాయవాది కట్ట కాళిదాసు బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు, పోలీస్ శాఖ ప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్యానెల్ న్యాయవాదులు, న్యాయ సేవా వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.




# జాతీయ సారస్ ఆజీవికా మేళాను ప్రజలు సందర్శించాలి: కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**విజయవాడ:పెన్ పవర్, అక్టోబర్, 14,**
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభం కానున్న జాతీయ సారస్ ఆజీవికా మేళా--2026 ఏర్పాట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్)తో కలిసి బుధవారం పరిశీలించారు.
ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన నాణ్యమైన ఆహార పదార్థాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విభిన్న ఉత్పత్తులను సారస్ మేళా ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ మేళాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డ్వాక్రా మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులకు బ్రాండింగ్, ప్యాకింగ్ ఎలా చేయాలి? రవాణాకు అనుగుణంగా ఉత్పత్తులను ఎలా సిద్ధం చేసుకోవాలి? ఆన్‌లైన్ రిటైలర్లతో ఎలా అనుసంధానం కావాలి? అనే అంశాలపై ప్రతిరోజూ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ



ప్రాంతాల నుంచి వచ్చే డ్వాక్రా మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారి ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడమే సారస్ మేళా ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా విచ్చేయడం ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరుతో పాటు పరిసర ప్రాంతాలు, జిల్లాల



ప్రజలు పెద్ద సంఖ్యలో మేళాకు విచ్చేసి వివిధ రాష్ట్రాల ఆహార రుచులను, ఉత్పత్తులను ఆస్వాదించాలని కోరారు. జాతీయ సారస్ ఆజీవికా మేళాను విజయవాడకు తీసుకురావడానికి ఆసక్తి చూపిన ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేక అభినందనలకు అర్హులని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

# అర్హులైన ఉపాధ్యాయులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి

**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 14:**
ఉమ్మడి కృష్ణా--గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ఉపాధ్యాయులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి అధికారులను ఆదేశించారు. ఎలక్టోరల్ రోల్స్ తయారీలో ఎలాంటి పొరపాట్లకు, ఫిర్యాదులకు తావు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.
ఈ మేరకు ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోలు, ఎంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు జాబితాల తయారీపై సమీక్షించారు. ఉన్నత పాఠశాలలు, ఆపై స్థాయి విద్యాసంస్థల్లో పనిచేస్తూ, నవంబర్ 1, 2026 నాటికి గత ఆరు సంవత్సరాల్లో కనీసం మూడేళ్ల బోధనా అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. సంబంధిత విద్యాసంస్థలు ప్రభుత్వ గుర్తింపు కలిగి ఉండాలని, ఉమ్మడి కృష్ణా--గుంటూరు జిల్లాల్లో సాధారణ ఓటరుగా నమోదై ఉండాలని పేర్కొన్నారు. పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ఈ ఓటరు నమోదు వర్తించదని స్పష్టం చేశారు. ఓటరు నమోదు నిబంధనలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటర్లుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలక్టోరల్ రోల్స్‌కు సంబంధించి నవంబర్ 25, 2026న ముసాయిదా ఓటరు జాబితా, డిసెంబర్ 30, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు ఖాజావలి వెల్లడించారు. నిర్ణీత గడువులోగా జాబితాల తయారీ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



# ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలకు ఉచితంగా వన్‌డ్రామ్ బాటిల్స్



**పర్చూరు, అక్టోబర్ 14 (పెన్ పవర్):**
రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్యశాల సేవలను మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు పర్చూరుకు చెందిన పత్తి కొనుగోలు వ్యాపారి కోసన నాగేశ్వరరావు తన వంతు సహకారం అందించారు. పర్చూరు మండలం ఉప్పుటూరులోని ప్రభుత్వ హోమియో వైద్యశాలకు అవసరమైన వన్‌డ్రామ్ బాటిల్స్‌ను తన సొంత నిధులతో కొనుగోలు చేసి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్‌కు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కోసన నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ హోమియో వైద్యశాల ద్వారా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అందిస్తున్న వైద్య సేవలను గుర్తించి, రోగులకు మరింత సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో వైద్యశాలకు అవసరమైన వన్‌డ్రామ్ బాటిల్స్‌ను అందించినట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు.
డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో అందిస్తున్న సేవలను గుర్తించి ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటానన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వైద్యశాలకు అవసరమైన సామగ్రిని అందించడం వల్ల రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. వన్‌డ్రామ్ బాటిల్స్‌ను అందించిన కోసన నాగేశ్వరరావు సేవాభావాన్ని, దాతృత్వాన్ని అభినందించారు.
కార్యక్రమంలో ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల సిబ్బంది, వైద్యం కోసం వచ్చిన రోగులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఏలూరిని మర్యాదపూర్వకంగా కలిసిన కారంచేడు ఎస్ఐ పులిగోపి



**కారంచేడు, అక్టోబర్ 14 (పెన్ పవర్):**
కారంచేడు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పులిగోపి బుధవారం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కారంచేడు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు. ప్రజలకు పోలీస్ శాఖ సేవలు మరింత చేరువయ్యేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

# రాష్ట్రపతికి స్వాగతం పలికిన పెమ్మసాని

**విజయవాడ:పెన్ పవర్, అక్టోబర్, 14,**
జాతీయ స్థాయి సరస్ అజీవికా మేళా ప్రారంభోత్సవంలోపాల్గొనేందుకు విజయవాడకు విచ్చేసిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ విజయవాడ విమానాశ్రయంలో బుధవారం సాదర స్వాగతం పలికారు. అక్టోబర్ 15వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు నిర్వహించిన ఈ మేళాలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపుకల్పించబోతున్నారు. గ్రామీణ మహిళల నైపుణ్యాలు, సృజనాత్మకత, వ్యాపార సామర్థ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో సరస్ అజీవికా మేళాను నిర్వహిస్తున్నారు. ఈ మేళా ద్వారా వివిధ రాష్ట్రాల సంప్రదాయ ఉత్పత్తులు, హస్తకళలు, ఆహార పదార్థాలు, మహిళా సంఘాల విజయగాథలు ప్రజలకు పరిచయం కానున్నాయి. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం, వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడటం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి పర్యటన సరస్ మేళాలో పాల్గొంటున్న మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు, గ్రామీణ మహిళా సాధికారత ప్రాధాన్యతను మరింతగా చాటనుంది.



# శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులను వేగవంతం చేయాలి కమిషనర్ కె. మయూర్ అశోక్

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 14,**
గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను వేగవంతం చేసేందుకు ఆర్ అండ్ బీ అధికారులు, కాంట్రాక్టర్, జీఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవతో కలిసి రెవెన్యూ, ఆర్ అండ్ బీ, జీఎంసీ అధికారులతో ఆయన సంయుక్త సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆర్ఓబీ నిర్మాణ పనుల వేగవంతానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ విషయంలో రెవెన్యూ అధికారులకు జీఎంసీ నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కోర్టు కేసులను కేసుల వారీగా సమీక్షించి, అవసరమైన వివరాలతో ఎప్పటికప్పుడు కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, కాంట్రాక్టర్ ప్రతినిధులు రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, అవసరమైన సంఖ్యలో కార్మికులు, యంత్ర పరికరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కె. శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ డి. రాంబాబు, ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బీ డీఈఈ రాజేంద్రనాయుడు, పశ్చిమ తహశీల్దార్ కిరణ్ కుమార్, ఆర్ఓబీ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



# సాయిబాబా108, వ ఆరాధన ఉత్సవాలు



**భట్టిప్రోలు, పెన్ పవర్ అక్టోబర్, 14:**
భట్టిప్రోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ షిరిడి సాయి, దత్తాత్రేయ స్వామి వారి దేవాలయంలో శ్రీ షిరిడి సాయిబాబా వారి 108వ ఆరాధనో త్సవాల సందర్భంగా శ్రీ బాబా వారికి బుధవారంకలసాభిషేకంనుభక్తిశ్రద్ధలతోనిర్వహించారు.అభిషేకంను తూనుగుంట్ల వంశీకృష్ణ-మానస లక్ష్మి, ఎనుమల సుందర నాడార్-శివపార్వతి, మాదాల ప్రవీణ్ రాజు-సుధారాణి, గొడవర్తి మనోజ్ బాలాజీ, మెడ తాటి రూప పనింద్ర, వాసి శ్రీనివాసరావు-రుక్మిణి కుమారిలు స్వామివారికి కలశాభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలను దేవస్థాన అధ్యక్షులు తమ్మన రమేష్ బాబు, ఉపాధ్యక్షులు బట్టు రమేష్ బాబు, చెన్నగిరి రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి జవాది వెంకటేశ్వరరావు, కోశాధికారి బూరెల కిరణ్ కుమార్, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులుతడవర్తిఅర్ధనారీశ్వరుడు, చందలూరు రామకోటేశ్వరరావు మరియు దేవస్థాన కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అభిషేకాధి కార్యక్రమాలను దేవస్థాన ప్రధాన అర్చకులు మురికిపూడి దుర్గాప్రసాద్ శర్మ జరిపించారు.

# ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు లీగల్ సెల్ పూర్తి సహకారం: బలసాని కిరణ్ కుమార్






**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 14:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు లీగల్ సెల్ విభాగం పూర్తి సహకారం అందిస్తుందని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ తెలిపారు.గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు బైపాస్ రోడ్డులోని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లీగల్ సెల్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో కూటమి ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులపై బైండోవర్ కేసులు నమోదు చేయడం, ఎన్‌ఓసీలు రాకుండా ఇబ్బందులకు గురిచేయడం వంటిచర్యలకుపాల్పడుతోందనిబలసానిఆరోపించారు.నియోజకవర్గంలో పార్టీ నాయకులు, అభ్యర్థులు ఎవరైనా అక్రమ బైండోవర్ చర్యలకు గురైనా, ఇతర ఇబ్బందులు ఎదుర్కొన్నా లీగల్ సెల్ సభ్యులు అండగా ఉంటారని తెలిపారు. రేపటి నుంచి లీగల్ సెల్ బృందం సభ్యులు పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.
పార్టీ తరఫున పోటీ చేసే ప్రతి అభ్యర్థికి నామినేషన్ల దాఖలాపై అవసరమైన న్యాయపరమైన సలహాలు, సూచనలు అందించడంతో పాటు అన్ని విధాలుగా సహకరిస్తామని బలసాని కిరణ్ కుమార్ స్పష్టం చేశారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఆషా



**గూడూరుపెన్ పవర్, అక్టోబర్ 14**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పెడన నియోజకవర్గ పరిశీలకురాలు షేక్ ఆషా పిలుపునిచ్చారు. గూడూరు మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రతి నెల రెండో బుధవారం నిర్వహించే మండల పార్టీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధమవుతూ కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గూడూరు మండల టీడీపీ అధ్యక్షుడు గోపి నాగబాబు, ప్రధాన కార్యదర్శి తోట వేణు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్.ఏ. బేగ్, శయన సోమయ్య, బొర్రా శ్రీను, కట్రెడ్డి నాగ మురళి, పోతుల రాము, కటకం నాగమల్లేశ్వరరావు, మాట్టా శ్రీను, బొల్లా అంకాలరావు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సరస్ మేళాలో వైద్య శిబిరాలు, ఐసీయూ యూనిట్ పరిశీలన





**విజయవాడ, పెన్ పవర్,అక్టోబర్ 14:**
జాతీయ సరస్ మేళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు, ఐసీయూ యూనిట్‌ను ఉన్నతాధికారులు బుధవారం పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ వెంకటరమణ, ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రావణ బాబు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవి దేవి వైద్య శిబిరాలను సందర్శించి, వైద్య సేవల ఏర్పాట్లను సమీక్షించారు. మేళాకు వచ్చే ప్రజలు, సందర్శకులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సహాయం అందించేలా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు



**భట్టిప్రోలు, పెన్ పవర్ అక్టోబర్ 14,**
వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి బి బ్రహ్మారెడ్డి అధ్యక్షతన బుధవారం సమాచార హక్కు చట్టం-2005 మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి బి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ, ప్రతీ పౌరుడు సమాచార హక్కు చట్టం గురించి తెలుసు కోవాలని సూచించారు. ప్రతీ వ్యక్తి తమకి కావాల్సిన ఎటువంటి సమాచారాన్ని అయినా కోరే హక్కు ఉంటుందని తెలిపారు. ఈ చట్టం తీసుకుని రావటం ద్వారా కేంద్ర ప్రభుత్వాల పనితీరు మరియు ఇతర అంశాలలో పారదర్శకత ను పెంపొందించటం జరుగుతుందన్నారు. అవినీతి నివారించటం ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు.కాగా ఇందులో దేశ మరియు రాష్ట్ర భద్రత, విదేశీ సంబంధాలకి సంబంధించిన సమాచారం కోరటం వీలు కాదని తెలిపారు. ఎవరైనా వ్యక్తి ఏదైనా సమాచారం కోరిన 30 రోజుల లోపు , సదరు శాఖ నుంచి సమాచారం ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఇ ఓ టి. అఖిల , మరియు రైతులు పాల్గొన్నారు.

# నడింపాలెంలో ఐదున్నర కోట్ల రూపాయలతో మురుగునీటి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 14,**
ఈరోజు అనగా అక్టోబరు పద్నాలుగవ తేదీన, ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామంలో నిర్మిస్తున్న కేంద్ర యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా సంస్థకు చెందిన వంద పడకల ఆసుపత్రి వద్ద వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ఐదున్నర కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న వర్షపు నీటి కాలువల నిర్మాణ పనులకు ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కల్యాణ్ గారి ఆశీస్సులతో నడింపాలెం గ్రామంలో వంద పడకల యోగా, ప్రకృతి వైద్య ఆసుపత్రి ఏర్పాటు కావడం నియోజకవర్గ ప్రజలందరికీ గర్వకారణమని తెలిపారు.దేశంలోనే నాలుగవ ప్రాజెక్టుగా ఈ ఆసుపత్రి మన ప్రాంతంలో ఏర్పాటు కావడం ఎంతో అదృష్టమని పేర్కొన్నారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఐదున్నర కోట్ల రూపాయల వ్యయంతో వర్షపు నీటి కాలువల నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కాలువల నిర్మాణం పూర్తయితే ఆసుపత్రి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా నివారించవచ్చని, పరిసరాల పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు రోగులకు,వైద్యసిబ్బందికి ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని వివరించారు.జాతీయ స్థాయిలో యోగా, ప్రకృతి వైద్య పరిశోధనలకు ప్రాధాన్యతనిచ్చే ఈ సంస్థకు అనుబంధంగా ఏర్పాటవుతున్న వంద పడకల ఆసుపత్రికి ఈ కాలువల నిర్మాణం ఎంతో కీలకమని శాసనసభ్యులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు మీడియా సమన్వయకర్త శ్రీ గింజుపల్లి వెంకటేశ్వరరావు గారు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీ గింజుపల్లి శివరాంప్రసాద్ గారు, కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బయోమెడికల్ వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేసిన కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులు







**గుంటూరు , పెన్ పవర్,అక్టోబర్ 14:**
గుంటూరు జిల్లా చినకాకానిలో ఉన్న సామూహిక జీవ వైద్య వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి ఎస్. శ్రీశరవణన్, అటవీ సేవల అధికారి, ప్రధాన పర్యావరణ ఇంజనీర్ ఎం. రాజశేఖర్‌తో కలిసి తనిఖీ చేశారు. కేంద్రం నిర్వహణ తీరును, పర్యావరణ నిబంధనల అమలును సమీక్షించారు.ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సంస్థల నుంచి సేకరించే వైద్య వ్యర్థాల సేకరణ, రవాణా, శుద్ధి, తుది పారవేతకు సంబంధించిన వ్యవస్థలను పరిశీలించారు. వ్యర్థాలను దహనం చేసే యంత్రాలు, ఆవిరి ద్వారా క్రిమిరహితం చేసే యంత్రాలు, ఇతర కాలుష్య నియంత్రణ వ్యవస్థల పనితీరును సమీక్షించారు.వివిధ వైద్య సంస్థల నుంచి సేకరిస్తున్న వ్యర్థాల పరిమాణం, శుద్ధికి సంబంధించిన రికార్డులు, యంత్రాల నిర్వహణ, పర్యావరణ ప్రమాణాల అమలు, జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ నిబంధనలు--2016 పాటింపు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన మార్గదర్శకాల అమలును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కేంద్ర నిర్వాహకులకు సభ్య కార్యదర్శి పలు సూచనలు చేశారు. మండలి జారీ చేసిన అనుమతుల్లో పేర్కొన్న అన్ని షరతులను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. వ్యర్థాల శుద్ధి యంత్రాలు, కాలుష్య నియంత్రణ వ్యవస్థలు నిరంతరంసమర్థవంతంగాపనిచేసేలా నిర్వహించాలని సూచించారు.వైద్య వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేరు చేయడం, సేకరించడం, రవాణా చేయడం, శుద్ధి చేయడం, సురక్షితంగా పారవేయడం వంటి ప్రక్రియల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. కేంద్రానికి వ్యర్థాలను పంపించే అన్ని వైద్య సంస్థల నుంచి స్వీకరించిన వ్యర్థాలకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని, రవాణా నుంచి తుది పారవేత వరకు వ్యర్థాలను గుర్తించే పర్యవేక్షణ వ్యవస్థనుపటిష్టంగాఅమలుచేయాలని సూచించారు.
వైద్యవ్యర్థాలసురక్షిత నిర్వహణ ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ రక్షణకు ఎంతో కీలకమని కాలుష్య నియంత్రణ మండలి స్పష్టం చేసింది. రాష్ట్రంలోని సామూహిక జీవ వైద్య వ్యర్థాల శుద్ధి కేంద్రాలన్నీ సంబంధితనిబంధనలు,మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. నిబంధనల అమలు ద్వారా పర్యావరణ పరిరక్షణకు, ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పునరుద్ఘాటించింది.

# జనసేనలో కష్టపడిన సామాన్య కార్యకర్తకు కార్పొరేటర్ టికెట్ ఇవ్వాలి 11 లేదా 12వ డివిజన్ టికెట్ ఆశిస్తున్న కొణిదె దుర్గాప్రసాద్






**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్, 14,**
జనసేన పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న సామాన్య కార్యకర్తలకు పార్టీ నాయకత్వం అవకాశం కల్పించాలని జనసేన పార్టీ ఉమ్మడి 12వ డివిజన్ అధ్యక్షుడు కొణిదె దుర్గాప్రసాద్ కోరారు. గుంటూరు నగరంలోని 11 లేదా 12వ డివిజన్ కార్పొరేటర్ టికెట్‌ను తాను ఆశిస్తున్నట్లు తెలిపారు.
2009లో ప్రజారాజ్యం పార్టీతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, అనంతరం జనసేన పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నానని వెల్లడించారు. పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ వెన్నంటే నిలిచి, ప్రతి ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశానని పేర్కొన్నారు.2024 ఎన్నికల్లో గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి 12వ డివిజన్‌లో పార్టీ గెలుపు కోసం పనిచేశానని తెలిపారు. సామాజిక మాధ్యమాలు, ఇతర వేదికల ద్వారా గత ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ పార్టీ తరఫున తన గొంతును వినిపించానని చెప్పారు.గత 17 సంవత్సరాలుగా రాజకీయాల్లో పట్టుదలతో కొనసాగుతూ, స్థానిక ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నానని దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన తన సేవలను గుర్తించి కార్పొరేటర్‌గా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.పదవుల కోసం కాకుండా ప్రజాసేవ, పార్టీ అభివృద్ధి లక్ష్యంగా రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు. రజక సామాజిక వర్గానికి చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జనసేన పార్టీ నాయకుడు చామర్తి ఆనందసాగరకు తన బయోడేటా అందించి, 11 లేదా 12వ డివిజన్ కార్పొరేటర్ టికెట్ కోసం తన అభ్యర్థనను పరిశీలించాలని కోరినట్లు తెలిపారు.
పార్టీ కోసం కష్టపడిన సామాన్య కార్యకర్తగా తన సేవలను గుర్తించి, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నట్లు కొణిదె దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.

# టిడ్కో గృహాల సముదాయంలో ఆలయ నిర్మాణనానికి భూమిపూజ చేసిన ప్రత్తిపాటి పుల్లారావు



**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 14:**
పల్నాడుజిల్లాచిలకలూరిపేటనియోజకవర్గంలోహిందూ ధర్మ పరిరక్షణ ఆధ్వర్యంలో శ్రీరాముడి ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి మాజీమంత్రి , శాసనసభ్యులుప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 35 సెంట్ల స్థలంలో నిర్మించనున్న శ్రీరాముడి ఆలయానికి మాజీ మంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా హాజరై భూమిపూజ చేశారు.హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా శ్రీరాముడి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సంబంధించిన భూమిపూజ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అబ్జర్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, టీడీపీ నాయకులు కందుల రమణ , గట్టినేని రమేష్, బీజేపీ పల్నాడు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పల్లపు శివయ్య, జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త పెంటల బాలాజీ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల నాగేశ్వరరావు, జిల్లా ఓబీసీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులపై అభ్యంతరాలు.. వైన్‌షాపు నిర్వాహకుడికి న్యాయం జరిగేనా?

## బెదిరింపులు, నగదు డిమాండ్ చేస్తున్నారంటూ శరత్‌బాబు ఆరోపణ

**మరో వైన్‌షాపు అనుమతులపైనా విచారణ జరపాలని విజ్ఞప్తి**






**పేరాల, అక్టోబరు 14, (పెన్ పవర్) :**
బాపట్ల జిల్లా చీరాల మండలం పేరాల సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గ వైన్‌షాపు నిర్వహణకు కొంతమంది అడ్డంకులు సృష్టిస్తున్నారని షాపు నిర్వాహకుడు శరత్‌బాబు ఆరోపించారు. శ్రీ కనకదుర్గ వైన్‌షాపు లైసెన్స్ హోల్డర్ సురగాని అమర్‌నాథ్‌బాబు పేరుతో సంబంధిత శాఖ నుంచి లైసెన్స్ జారీ అయిన తర్వాతే షాపును ఏర్పాటు చేసినట్లుశరత్‌బాబు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన అనుమతులు పొంది, భవనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు సమర్పించి, యజమానితో అగ్రిమెంట్ చేసుకున్న అనంతరం వ్యాపారం ప్రారంభించామని పేర్కొన్నారు. అయినప్పటికీ కొంతమంది నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలతో తమ వ్యాపారానికి ఆటంకం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**నిబంధనల ప్రకారమే షాపు ఏర్పాటు**

వైన్‌షాపు ఏర్పాటుకు అవసరమైన పత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించి అనుమతులు పొందినట్లు శరత్‌బాబు వివరించారు. షాపునకు సమీపంలోని మసీదు 120 మీటర్లకు పైగా దూరంలో ఉందని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగానే షాపును ఏర్పాటు చేశామని పేర్కొంటూ, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు.

**మరో వైన్‌షాపుపైనా విచారణ జరపాలి**

పేరాల ప్రధాన కూడలి రైల్వే గేటు సమీపంలో రహదారి పక్కన మరో వైన్‌షాపు కూడా నిర్వహిస్తున్నారని శరత్‌బాబు పేర్కొన్నారు. ఆ షాపు రహదారి ఆక్రమణకు సంబంధించిన ప్రాంతంలో చిన్న రేకుల షెడ్డు ఏర్పాటు చేసి, డోర్ నంబరు, అగ్రిమెంట్ ఆధారంగా సుమారు 20 ఏళ్లుగా కొనసాగుతోందని ఆరోపించారు. ఆ షాపునకు అవసరమైన అనుమతులు, లైసెన్స్‌లు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారా? అనే అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించాలని కోరారు. అన్ని వైన్‌షాపుల అనుమతి పత్రాలను నిష్పక్షపాతంగా తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు.

**నాలుగైదు రోజులుగా వ్యాపారానికి ఆటంకాలు**

గత నాలుగైదు రోజులుగా కొంతమంది తమ షాపు వద్ద నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ వ్యాపార కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారని శరత్‌బాబు ఆరోపించారు. మహిళలను ముందుకు తీసుకొచ్చి ఆందోళనలు నిర్వహించడం ద్వారా అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తమ షాపు వల్ల ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగడం లేదని పేర్కొంటూ, అధికారులు స్వయంగా పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు.

**రోజుకు రూ.40 వేల చొప్పున నష్టం**

వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడటంతో రోజుకు సుమారు రూ.40 వేల చొప్పున ఐదు రోజులుగా ఆర్థిక నష్టం ఎదురవుతోందని శరత్‌బాబు తెలిపారు. కొంతమంది ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడుతూ నగదు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకపోతే వ్యాపారం సాగనివ్వబోమని హెచ్చరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి, ఆధారాల ప్రకారం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**అధికారులు స్పందించి న్యాయం చేయాలి**

శ్రీ కనకదుర్గ వైన్‌షాపు లైసెన్స్ హోల్డర్ సురగాని అమర్‌నాథ్‌బాబుకు సంబంధించిన లైసెన్స్, షాపునకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, అగ్రిమెంట్, ఇతర అనుమతులను అధికారులు పరిశీలించాలని శరత్‌బాబు కోరారు. రైల్వే గేటు సమీపంలోని మరో వైన్‌షాపు నిర్వహణపైనా విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమపై వచ్చిన అభ్యంతరాలను నిష్పక్షపాతంగా పరిశీలించి, బెదిరింపులు, నగదు డిమాండ్ ఆరోపణలపైనా విచారణ చేపట్టాలని కోరారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి, తమ వ్యాపారానికి ఆటంకాలు లేకుండా న్యాయం చేయాలని సంబంధిత అధికారులను శరత్‌బాబు విజ్ఞప్తి చేశారు.

# రాజారావుపేట(కష్టాలగడ్డ)లో దసరా నవరాత్రి వైభవం

## నాలుగవ రోజు పూజలో పాల్గొన్న అప్పిశెట్టి కోటేశ్వరావు- తిరుపతమ్మ కుటుంబ సభ్యులు




**పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల అక్టోబర్ 14 :--**
మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలో రాజారావుపేట (కష్టాల గడ్డలో) ఏర్పాటు చేసిన మండపంలో దసరా నవరాత్రులు మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణంలో జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఇవాళ నాలుగో రోజు పూజా కార్యక్రమంలో అమ్మవారు శ్రీ మహా చండి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం అమ్మవారి పూజలో అప్పిశెట్టి కోటేశ్వరావు ధర్మపత్ని తిరుపతమ్మ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమార్చనలు నిర్వహించారు. దసరా నవరాత్రి సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు మహిళలు అర్చకులు బుక్కం పట్నం దిలీప్ కుమార్ చార్యులు పాల్గొన్నారు.

# రైతులకు ఆర్టీఐ చట్టంపై అవగాహన



**వేటపాలెం, అక్టోబర్ 14 (పెన్ పవర్):**
వేటపాలెం మండలం అక్కయ్యపాలెం రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేటపాలెం మండల వ్యవసాయ అధికారి ఎం. సరిత పాల్గొని రైతులకు ఆర్టీఐ చట్టం ఉపయోగాలు, దాని ద్వారా ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన సమాచారాన్ని ఏ విధంగా పొందవచ్చనే అంశాలపై వివరించారు.ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ శాఖకు సంబంధించిన కార్యక్రమాలు, తమకు అవసరమైన అధికారిక సమాచారాన్ని తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. ఆర్టీఐ ద్వారా సమాచారం కోరే విధానం, దరఖాస్తు చేసుకునే ప్రక్రియ తదితర అంశాలను రైతులకు వివరించారు.కార్యక్రమంలో వేటపాలెం మండల వ్యవసాయ సహాయకులు, రైతు సోదరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీలో చేరిన వంగవీటి రాధాకృష్ణ

## పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన పవన్ కళ్యాణ్





**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 14,**
దివంగత వంగవీటి మోహన రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాధాకృష్ణకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.
పార్టీకార్యాలయానికి చేరుకున్న వంగవీటి రాధాకృష్ణకు పవన్ కళ్యాణ్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని స్వాగతం పలికారు. అనంతరం రాధాకృష్ణ తన అనుచరులను పవన్ కళ్యాణ్‌కు పరిచయం చేశారు. వారందరితో పవన్ కళ్యాణ్ ఆప్యాయంగా మాట్లాడి ఫోటోలు దిగారు.జనసేన పార్టీ సిద్ధాంతాల కోసం కలిసికట్టుగా పనిచేయాలని, ప్రజాసేవలో సమష్టిగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు మాదల చైతన్య దంపతుల చేయూత గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 13:

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఆరుగురికి రూ. 6 వేల జరిమానా

**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 14:**
పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఆరుగురు వ్యక్తులకు స్థానిక న్యాయస్థానం జరిమానా విధించింది. బహిరంగంగా మద్యం తాగుతూ పట్టుబడిన ఈ ఆరుగురిని చిలకలూరిపేట పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జంగు మహబూబ్ సుభాని గారు, నిందితులకు ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున మొత్తం రూ. 6,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు ఈ సందర్భంగా ప్రజలను హెచ్చరించారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి' పేదల ఆరోగ్య రక్షణా కవచం : ప్రత్తిపాటి

## కూటమి పాలనలో ప్రజారోగ్య వ్యవస్థ మెరుగుపడింది.

**-మారుమూల ప్రాంతాలు, గిరిజన గ్రామాల్లోనూ మెరుగైన వైద్యసేవలు**
**-94 మందికి రూ.39.63లక్షల సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ప్రత్తిపాటి**



**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 14:**
మెరుగైన వైద్యసేవలు, నాణ్యమైన శస్త్రచికిత్సలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడంలో కూటమి ప్రభుత్వం వేగంగా స్పందిస్తోందని, తమ ఆరోగ్య రక్షణ కోసం పేద, మధ్య తరగతి వర్గాలు అప్పులు పాలు కాకుండా అండగా నిలుస్తోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిజంగా పేద ప్రజల ఆరోగ్యాన్నిఒక రక్షణ కవచంలా కాపాడుతోందన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఆయన నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీ.ఆర్.ఎం.ఎఫ్) నగదు చెక్కుల్ని పంపిణీ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో టీడీపీ నేతలతో కలిసి మొత్తం 94 మందికి రూ.39,63,411లు విలువైన ఆర్థిక సాయాన్ని ప్రత్తిపాటి స్వయంగా అందచేశారు. అనంతరం ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు.

**కూటమి పాలనలో ప్రజారోగ్య వ్యవస్థ మెరుగుపడింది.**

కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్య వ్యవస్థ మెరుగుపడిందని, మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన వైద్యసేవలు ప్రజలకు అందుతున్నాయని ప్రత్తిపాటి చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా వైద్య సామగ్రిని పంపిణీ చేస్తున్నారని, అటవీప్రాంతాల్లోని గ్రామాలకు కూడా మెరుగైన రోడ్డు రవాణా సౌకర్యం ఏర్పాటుచేసి, సకాలంలో వారికి అన్నిరకాల సేవల్ని ప్రభుత్వం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మేలైన వైద్యసేవలు అందుతున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో వారికి ఎదురయ్యే ప్రాణాంతక, దీర్ఘకాలిక వ్యాధులకు మరింతమెరుగైనవైద్యచికిత్సలుఅవసరమవుతున్నాయని ప్రత్తిపాటి తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఆర్థిక సమస్యలతో బాధపడే పేద, మధ్య తరగతి ప్రజలు, అనారోగ్య సమస్యలతో ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదన్న గొప్ప లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీఎంసహాయ నిధి సాయాన్ని అందిస్తున్నారని ప్రత్తిపాటి వివరించారు. త్వరలో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నసంజీవని ప్రాజెక్ట్ ద్వారా ఏపీ ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు, వివిధ రకాల వైద్యపరీక్షలు నేరుగా ప్రజల ముంగిటకే రాబోతున్నాయని ప్రత్తిపాటి తెలియ చేశారు.

# పెద్దపులివర్రు ఫీడర్ పరిధిలో విద్యుత్ కు అంతరాయం



**భట్టిప్రోలు, పెన్ పవర్ అక్టోబర్ 14:**
భట్టిప్రోలు మండలం పెద్దపల్లి పెసరలంక పెదలంక గ్రామాలకు చెందిన వ్యవసాయ ఆహ్వానిత పంపుసెట్లకు విద్యుత్ సరఫరా గురువారం నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ ఏఈ నాగూర్ మేర బుధవారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం గం 08:00 ల నుండి మధ్యాహ్నంగం 03:00 ల వరకు పెద్దపులివర్రు సబ్ స్టేషన్ నందు గల 11కే వి పెసర్లంక ఫీడర్ లో లైన్ మరమ్మతులు మరియు లైన్ కు తగిలే చెట్లు తొ లగించడం జరుగుతుందన్నారు.అందువలన ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 03:00గంటల వరకు 3పి హెచ్ మోటార్ కరెంటు ఉండదనీ ఆయన తెలిపారు. ప్రసన్నంకా పెదలంక గ్రామాలలో గృహాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉండాలని వేయి తెలిపారు. వినియోగదారులు అందరు అర్థం చేసుకుని సహకరించ గలరని ఆయన కోరారు.

# రోలర్ స్కేటింగ్‌లో చిలకలూరిపేట విద్యార్థుల సత్తా.

## రెండు బంగారు పతకాలతో మెరిసిన షేక్ ఇషాన్ క్రైస్.

**రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు ఎంపిక.**



**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 14:**
21వ గుంటూరు జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో చిలకలూరిపేటకు చెందిన చేజ్ స్కేటింగ్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అక్టోబర్ 10, 11 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో అకాడమీకి చెందిన విద్యార్థులు పతకాలు సాధించడంతోపాటురాష్ట్రస్థాయిపోటీలకుఎంపికయ్యారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో 4 నుంచి 6సంవత్సరాల వయస్సు విభాగంలో షేక్ ఇషాన్ క్రైస్ రెండు బంగారు పతకాలు సాధించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైఅకాడమీకి, చిలకలూరిపేటకు గర్వకారణంగా నిలిచారు.అదేవిధంగా కావ్య, గిరిప్రదీప్, టి. హేమంత్, ఎస్.కె. పీరుల్లా తదితర విద్యార్థులు కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

**విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు.**

పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రతిపాటి పుల్లారావుఅభినందించారు. విద్యార్థులుక్రీడల్లోమరింత రాణించిఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అకాడమీ అధినేత యు.జె. రఘురామ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సాధించిన విజయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, ఉదయ్, విద్యార్థుల తల్లిదండ్రులు, చేజ్ స్కేటింగ్ అకాడమీ కోచ్‌లు విజయ్, మౌనిక తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# గుంటూరు కన్యకాపరమేశ్వరి అమ్మవారి పుష్పశయ అలంకరణకు పోటెత్తిన భక్తులు



**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 14:**
గుంటూరు ఆర్. అగ్రహారంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో నాలుగో రోజైన బుధవారం అమ్మవారుఅత్యంత విశిష్టమైన పుష్పశయ అలంకారంలోభక్తులకు దర్శనమిచ్చారు. టన్నుల కొద్దీ పూలు, అందమైన పూలమాలలతో ఆలయాన్ని అద్భుతంగా అలంకరించారు. అమ్మవారి పుష్పశయ అలంకరణను దర్శించుకునేందుకు గుంటూరు నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**ముఖ్య అతిథిగా గ్రంధిలక్ష్మీకాంతారావు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రేన్ గ్రూప్స్ అధినేత గ్రంధి లక్ష్మీకాంతారావు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిడమానూరు శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ కోట శేషగిరి, మిర్చియార్డ్ డైరెక్టర్ కొనకళ్ళ సత్యం, కొణిజేటి గోపి, బచ్చు యోగి, మామిడి సురేష్, బత్తుల శేషగిరి, పెండేల నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి పుష్పశయ అలంకరణతో ఆలయ ప్రాంగణమంతా భక్తిభావంతో, పూల సౌందర్యంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



## కరీంనగర్ ఎస్ఆర్ఆర్ పీజి రెండవ మరియు నాలుగవ సెమిస్టర్ ఫలితాలు విడుదల





**పెన్ పవర్,అక్టోబర్ 14 :**

కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటనామస్ కళాశాల పీజీ రెండవ మరియు నాలుగవ సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మరియు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య తిరుకోవెల శ్రీనివాస్ మరియు అధ్యాపక బృందంతో కలిసి విడుదల చేశారు

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ రెండవ సెమిస్టర్ లో 86 శాతం, నాలుగవ సెమిస్టర్ లో 84 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారుఈ సందర్భంగా పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది కళాశాల నుండి బయటకు వెళ్తున్న పీజీ మూడవ బ్యాచ్ అని, వారు జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని కోరారు

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పీ నితిన్, టి రాజయ్య, టీజీసీజీటిఏ అధ్యక్షులు మరియు ఉన్నత విద్య ఐకాస చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య తిరుకోవెల శ్రీనివాస్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ తాండ్ర కరుణాకర్, డాక్టర్ ఎం మల్లారెడ్డి, పీజీ సమన్వయకర్త మధు రాజేష్, అకాడమిక్ సమన్వయకర్తలు డాక్టర్ ఏ.శంకరయ్య, డాక్టర్ కట్టా వేణు, ఐక్యూఏసి సమన్వయ హర్ జ్యోత్ కౌర్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## జగిత్యాల 3వ వార్డులో బతుకమ్మ సంబరాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్





**పెన్ పవర్,అక్టోబర్ 14 :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని 3వ వార్డులో గాయత్రి మేక్ ఓవర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు -- 2026 వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.జ్యోతి మాట్లాడుతూ మన సంస్కృతి.. మన సంప్రదాయం.. మన బతుకమ్మ.. మన ఆత్మీయత.. అనే నినాదంతో నిర్వహించిన ఈ వేడుకలు తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, పూల పండుగ గొప్పతనానికి ప్రతీకగా నిలిచాయి. బతుకమ్మ పండుగ మన తెలంగాణ అస్తిత్వాన్ని, మహిళల ఐక్యతను, ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని చాటిచెబుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ రాగుల ప్రదీప్ కుమార్, సిద్ధి హిందూ యూత్ సభ్యులు మరియు మహిళలు, పిల్లలు, భగవత్ బాంధవులందరూ పాల్గొన్నారు

## రాయికల్ లో ఈనెల19న బతుకమ్మ పండుగ20న దసరా పండుగలు-మున్సిపల్ చైర్మన్ కట్కాం,రవీందర్






**రాయికల్ ఎన్ పవర్, అక్టోబర్, 14,**

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో 19 ఈ నెల 19 సోమవారం బతుకమ్మ పండుగ మంగళవారం దసరా జరుపుకోవాలని మున్సిపాలిటీ పాలకవర్గం నిర్ణయం తీసుకుందని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ తెలిపారు.

బతుకమ్మ పండుగ కొరకు పెద్ద చెరువు వద్ద అన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆనందోత్సవాల మధ్య మహిళలు బతుకమ్మ పండుగనుజరుపుకోవాలనిఅలాగేదసరా మంగళవారం నాడు పట్టణంలోజరుపుకోవాలనిమున్సిపల్పాలకవర్గం నిర్ణయించామని అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రజలు సహకరించాలని రవీందర్ కోరారుఇది ఇలా ఉండగా బతుకమ్మ పండుగ జల్మె చెరువుదగ్గర బతుకమ్మ ఘాటు కట్టాలని కోరగా మున్సిపల్ చైర్మన్ అవార్డుసభ్యులు పోయి అక్కడ వాస్తవమైన పరిస్థితులను చూసిన రవీందర్ ఆవార్డు ప్రజలు ఇది ఇలా ఉండగా రాయికల్ పట్టణము సమస్యలతో పోరాడుతున్న ప్రజల అవసరాలను తీర్చడంలో విఫలమైన పాలకవర్గం అని ప్రజలు అంటున్నారు

## జగిత్యాలపట్టణం విద్యానగర్‌లో గాజుల అలంకరణలో దర్శనమిచ్చిన జయ దుర్గ అమ్మవారు





**రాయికల్ ఎన్ పవర్, అక్టోబర్, 14,**

జగిత్యాలపట్టణం విద్యానగర్‌లో జయ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ జయ దుర్గ అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జయ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో జయదుర్గా సేవా సమితి నిర్వాహకులు ముసిపట్ల లక్ష్మీనారాయణ, దాసరి దామోదర్, నలువాల శ్రీకాంత్, బిట్టు, గాదె కార్తీక్, అలిశెట్టి కిషన్, సింగారావు, నడిపి గంగారాం, ఫణిభూషణ్, ప్రసన్న, శ్రీరామ్, భగీరథ, నలువాలభగీరత్, అలిశెట్టి సాయిభూషణ్ తమ్ముడు సాయి, హరీష్, తిరుపురం రాం చందర్, ద్యావన పెల్లి శంకర్, మాధురి, ఆయన్స్, ఆద్వి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రకటన విడుదల నియమావళి పక్కాగా అమలు చేయాలి



**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 14 :**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనను రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఎన్నిల ఎన్నికల ప్రకటన విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి తక్షణం అమలులోకి వచ్చిందని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జిల్లా అధికారులు, స్థానిక సంస్థల అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన మేరకు నగర పాలక సంస్థలు, పురపాలక సంస్థలు, ఎంపీటీసీ - జడ్పిటిసి, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థకు, తెనాలి పురపాలక సంస్థకు జిల్లాలో ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. అక్టోబర్ 16వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి, అదే రోజు నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. నామినేషన్లను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. అక్టోబర్ 18 వ తేదీన నామినేషన్ల దాఖలు చేయుటకు చివరి తేదీ అని తెలిపారు. 19వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, 21వ తేదీన అభ్యర్థిత్వం ఉపసంహరణకు ఆఖరు తేదీ అని వివరించారు. 21వ తేదీన పోటీచేసే అభ్యర్థుల జాబితా ప్రకటన చేయడం జరుగుతుందని చెప్పారు. 28వ తేదీన ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 30వ తేదీన ఓట్ల లెక్కింపుఉదయం8గంటలనుండిప్రారంభమవుతుంద ని అన్నారు. ఎంపీటీసీ జడ్పిటిసి లకు నోటిఫికేషన్ విడుదల అనంతరం నవంబర్ మూడవ తేదీన పోలింగ్ జరుగుతుందని, ఐదవ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు గఫంలో దశలలో జరుగుతుందని, డిసెంబర్ రెండవ తేదీ నాటికి చివరి దశ పూర్తి అవుతుందని వివరించారు. జిల్లాలో మొత్తం 207 గ్రామ పంచాయతీ లకు ఎన్నికలు జరుగుతాయని అన్నారు.

జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని స్పష్టం చేశారు. స్టాటిక్ టీమ్ లు, సర్వేలియన్స్ టీములు, ఫ్లయింగ్ స్క్వాడ్ ల నియామకం జరిగిందని అన్నారు. ఎన్నికల నియమావళిని అందరి అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఎక్కడ లోపాలు ఉండరాదని స్పష్టం చేశారు. 50 వేలకు పైగా నగదు తీసుకు వెళ్ళుటకు అవకాశం లేదని, పెద్ద స్థాయిలో కానుకలు, మద్యం సరఫరా, రవాణా జరగరాదని సూచించారు. మద్యం విక్రయాలపై ప్రతిరోజు స్థానిక రెవెన్య డివిజనల్ అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు, కంట్రోల్ రూమ్ కు నివేదికలు సమర్పించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. మద్యం విక్రయాలపై పూర్తిస్థాయి నిఘా ఉండాలని చెప్పారు.

గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం

గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,

జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ నిబంధనలు పక్కాగా పాటించాలి..నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అధారిటీ మయూర్ అశోక్ హెచ్చరిక





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 14,**

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తక్షణమే అమలులోకి వచ్చిందని, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అధారిటీ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. బుధవారం నిర్వహించిన ప్రత్యేక టెలికాన్ఫరెన్స్‌లో ఆయన అధికారులకు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎంసిసి అమలు దృష్ట్యా గుంటూరు నగరంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయటంతో పాటు పోస్టర్స్, బ్యానర్స్ తొలగించే చర్యలు ప్రారంబించామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సిబ్బంది అంతా 'డబుల్ అలర్ట్'గా ఉండాలని సూచించారు. కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో సమర్థవంతమైన నిర్వహణ అత్యంత ప్రధానమని, ఉద్యోగులందరికీ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సెలవులను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించిన ఆదేశాలు వాట్సాప్ లేదా అధికారిక గ్రూపులలో పోస్ట్ చేసిన వెంటనే సిబ్బంది తమకు కేటాయించిన విధులకు తక్షణమే హాజరుకావాలని, సమాచారం తెలియదనే సాకులు ఎంతమాత్రం చెల్లవని స్పష్టం చేశారు. ఉద్యోగులందరూ రాజకీయ తటస్థత వహించాలని, ఏ అభ్యర్థి లేదా రాజకీయ నాయకుడితో ప్రచారాల్లో పాల్గొనడం కానీ, సోషల్ మీడియా వేదికగా రాజకీయ మద్దతు తెలపడం కానీ పూర్తి నిషిద్ధమని స్పష్టం చేశారు. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై ఉన్న రాజకీయ పోస్టర్లు, బ్యానర్లను వెంటనే తొలగించాలని, ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు లేదా కానుకల పంపిణీ వంటివి జరుగుతున్నట్లు దృష్టికి వస్తే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పనికి కేటాయించిన గడువును పాటిస్తూ వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల లోపల ప్రచారాలకు తావులేకుండా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులు అత్యంత ప్రాధాన్యమైనవి అయినప్పటికీ దైనందిన రెగ్యులర్ ప్రభుత్వ పనులు ఆగిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

## వంగవీటి రాధా వర్సెస్ దేవినేని అవినాష్? మేయర్ పీఠంపై ఎవరి ప్రభావం ఎంత? చూద్దాం ఈ ప్రత్యేక కథనం.





**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 14,**

బెజవాడ రాజకీయాల్లో మరోసారి ఆసక్తికర చర్చ మొదలైంది..! విజయవాడ మేయర్ పీఠం చుట్టూ వంగవీటి రాధాకృష్ణ, దేవినేని అవినాష్ పేర్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తుండటంతో నగర రాజకీయాలపై ఉత్కంఠ నెలకొంది. ఒకవైపు కూటమి బలం.. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక శ్రేణుల బలం..! మరి బెజవాడ రాజకీయాల్లో ఎవరి వ్యూహం ఫలిస్తుంది? మేయర్ పీఠంపై ఎవరి ప్రభావం ఎంత? చూద్దాం ఈ ప్రత్యేక కథనం.

విజయవాడ..! రాజకీయ చైతన్యానికి, చారిత్రక రాజకీయ పోరాటాలకు పేరుగాంచిన నగరం. ఇప్పుడు మరోసారి మేయర్ పీఠంపై రాజకీయ చర్చ ఆసక్తికరంగా మారుతోంది. వంగవీటి రాధాకృష్ణ, దేవినేని అవినాష్ పేర్లు తెరపైకి రావడంతో రాజకీయ వర్గాల్లో కొత్త సమీకరణాలపై చర్చ సాగుతోంది.

వంగవీటి రాధాకృష్ణకు కూటమి రాజకీయ బలం, వ్యక్తిగత గుర్తింపు అనుకూల అంశాలుగా చర్చకు వస్తున్నాయి. అయితే కూటమిలోని భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, వార్డు స్థాయిలో కార్యకర్తల బలం, స్థానిక నాయకుల సహకారం కీలకం కానున్నాయి.

మరోవైపు దేవినేని అవినాష్‌కు వైసీపీ శ్రేణులతో ఉన్న సంబంధాలు, స్థానిక రాజకీయ పరిచయాలు ప్రాధాన్యంసంతరించుకుంటున్నాయి.పార్టీకార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, ప్రజల్లో తమ పార్టీ పట్ల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ఆయనకు కీలకంగా మారవచ్చు.అయితే రాజకీయ గుర్తింపు, సామాజిక సమీకరణాలు మాత్రమే విజయాన్ని నిర్ణయించలేవు. వార్డులవారీగా ఉన్న బలం, ప్రజాభిప్రాయం, స్థానిక సమస్యలపై నాయకుల స్పందన, పార్టీల వ్యూహాలే కీలక పాత్ర పోషించనున్నాయి.ముఖ్యంగా తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ సమస్యలు, వరద ముంపు నివారణ వంటి అంశాలపై నగర ప్రజలకు స్పష్టమైన పరిష్కారాలు కావాలి. మేయర్ పీఠాన్ని ఆశించే నాయకులు నగర అభివృద్ధిపై తమ ప్రణాళికలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది.అయితే ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాలి. రాధాకృష్ణ లేదా అవినాష్ మేయర్ అభ్యర్థులుగా అధికారికంగా ఖరారైనట్లు నిర్ధారించే సమాచారం లేకుండా, ఈ పోటీని ఖరారైన రాజకీయ పోరుగా చెప్పలేం. పార్టీ నిర్ణయాలు, ఎన్నికల పరిస్థితులు స్పష్టమైన తర్వాతే అసలు సమీకరణాలపై అంచనా వేయగలం.ముగింపు:మొత్తానికి బెజవాడ మేయర్ పీఠంపై ఎవరి పేరు ముందుకు వస్తుంది? కూటమి బలం పైచేయి సాధిస్తుందా? వైసీపీ తన స్థానిక శ్రేణులతో గట్టి పోటీ ఇస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

కానీ రాజకీయాలకంటే ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్యమని నగరవాసులు భావిస్తున్నారు. మేయర్ పీఠంపై ఎవరు కూర్చున్నా.. విజయవాడ అభివృద్ధికి బాధ్యత తీసుకోవాల్సిందే.

బెజవాడ రాజకీయాల్లో తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయి? వేచి చూడాలి..!

## అల్లిపూర్ పాక్స్ చైర్మెన్ తంగెల్లా రమేష్,అనంతరం,కల్లెడ గ్రామాలలో ఆయాకుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**రాయికల్ ఎన్ పవర్, అక్టోబర్, 14,**

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్ ) చైర్మన్ తంగెల్లా రమేశ్ తల్లి తంగెల్లా లక్ష్మీదేవి మృతి చెందడంతో, కిష్టంపేట గ్రామం స్వగృహానికి వెళ్లిన జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ పార్థివదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.లక్ష్మీదేవి మృతి పట్ల విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అలాగే అనంతరం గ్రామానికి చెందిన జంగ చిన్న గంగన్న, కల్లెడ గ్రామానికి చెందిన అంకతిలచ్చాన్న గుండెపోటుతో మృతి చెందగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజేంగి నందయ్య లు ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యుల పరమర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య,ఆత్మ చైర్మన్ కాట్పల్లి గంగారెడ్డి,రాయికల్ మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీనాయకులు,సర్పంచులు,కార్యకర్తలు,తది తరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో టీమిండియా ఓటమి.. 2-2తో సిరీస్ సమం చేసిన విండీస్



హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ఉప్పల్) వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ బౌలర్ల దెబ్బకు భారత జట్టు ఘోరంగా ఓడిపోయింది. విండీస్ నిర్దేశించిన 248 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా తడబడి, 24 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను వెస్టిండీస్ 2-2 తేడాతో సమం చేసింది. ఈ ఉత్కంఠభరిత పోరులో కీమో పాల్ ఐదు వికెట్లతో చెలరేగి భారత్ విజయానికి గండికొట్టగా, మ్యాచ్ మధ్యలో పేసర్ అర్షదీప్ సింగ్ గాయంతో రిటైర్డ్ హార్ట్ కావడంతో 19.3 ఓవర్లలోనే టీమిండియా ఆలౌట్ అయింది.

**కీమో పాల్ వీరవిహారం:**

248 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు మంచి ఆరంభమే ఇచ్చినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా వెస్టిండీస్ బౌలర్ కీమో పాల్ టీమిండియా ఇన్నింగ్స్‌ను శాసించాడు. ఒకే ఓవర్లో నితీష్ కుమార్ రెడ్డి (41 పరుగులు), ప్రిన్స్ యాదవ్ (గోల్డెన్ డక్), అక్షర్ పటేల్ (3 పరుగులు)లను పెవిలియన్‌కు పంపి మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 5 వికెట్లు పడగొట్టి ఇండియా విజయావకాశాలను దెబ్బతీశాడు. ఆయనతో పాటు గుడకేష్ మోటీ 2 వికెట్లు తీసుకోగా, షామర్ స్ప్రింగర్, రొమారియ షెపర్డ్ తలో వికెట్ తీసుకుని భారత్‌ను కోలుకోలేని దెబ్బతీశారు.

**పోరాడి ఓడిన భారత బ్యాటర్లు:**

భారత జట్టు తరపున సంజు శాంసన్, తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ (43), నితీష్ కుమార్ రెడ్డి (41), అభిషేక్ శర్మ (29) పోరాడినప్పటికీ 248 పరుగుల లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోయారు. ముఖ్యంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16), ఇషాన్ కిషన్ (6), నమన్ ధీర్ (0), అక్షర్ పటేల్ (3) బ్యాటింగ్‌లో పూర్తిగా విఫలమయ్యారు.

దీనికి తోడు పేసర్ అర్షదీప్ సింగ్ గాయం కారణంగా రిటైర్డ్ హార్ట్‌గా వెనుదిరగడం జట్టు 223 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో 24 పరుగుల తేడాతో ఇండియా ఓడిపోయింది. ఇక ఐదో టీ20 మ్యాచ్ బెంగళూరు వేదికగా అక్టోబర్ 17వ తేదీన జరగనుంది.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ల హవా.. శ్రేయస్ అయ్యర్‌కు కెరీర్ బెస్ట్ ర్యాంక్!

- టీ20 ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి దూసుకెళ్లిన శ్రేయస్
- తొలి టీ20 సెంచరీతో కెరీర్లోనే అత్యుత్తమ ర్యాంక్ సాధించిన వైనం
- టాప్-4లో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, అయ్యర్‌తో ముగ్గురు భారతీయులు
- టెస్టుల్లో నంబర్ వన్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా స్థానం పదిలం
- ఆసీస్, పాక్, దక్షిణాఫ్రికా ఆటగాళ్ల ర్యాంకుల్లోనూ కీలక మార్పులు



భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకున్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అయ్యర్, మూడు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంకును కైవసం చేసుకున్నాడు. లక్నో వేదికగా జరిగిన సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని నమోదు చేయడం అతడి ర్యాంకు భారీగా పెరగడానికి కారణమైంది.అయ్యర్ రాకతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్-4లో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అభిషేక్ శర్మ రెండో స్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇదే సిరీస్‌లో రాణించిన మరో భారత ఆటగాడు సంజూ శామ్సన్ కూడా నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 27వ ర్యాంకుకు చేరుకున్నాడు.

ఇక బౌలింగ్ విషయానికి వస్తే.. భారత్‌తో సిరీస్‌లో రాణించిన వెస్టిండీస్ ఆటగాడు రోస్టన్ చేజ్ 24 స్థానాలు ఎగబాకి 23వ ర్యాంకులో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో స్థానానికి చేరుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ సల్మాన్ మీర్జా 14వ స్థానానికి, సయీం అయూబ్ 54వ స్థానానికి మెరుగుపడ్డారు.

**టెస్టుల్లోనూ కీలక మార్పులు**

దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 214 పరుగుల తేడాతో విజయం సాధించడంతో టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో 190, 82 పరుగులతో అద్భుత ప్రదర్శన చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన ఆస్ట్రేలియా బ్యాటర్ మాథ్యూ రెన్షా, ఏకంగా టాప్-100 బయట నుంచి 49వ ర్యాంకుకు దూసుకొచ్చాడు.

ఆసీస్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ కెరీర్ బెస్ట్ గణాంకాలతో (6/49) రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో ర్యాంకుకు చేరుకున్నాడు. మిచెల్ స్టార్క్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు.భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో తన నంబర్ వన్ స్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన టెస్టులో రాణించిన రహ్మత్ షా 13వ ర్యాంకుకు, లిటన్ దాస్ 29వ ర్యాంకుకు చేరుకున్నారు.

## అభిషేక్ శర్మ రికార్డు బద్దలు కొట్టిన పాక్ కెప్టెన్ ఫర్హాన్!



పాకిస్థాన్ కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ టీ20 క్రికెట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు. శ్రీలంకతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 238 పరుగులు సాధించి, భారత ఆటగాడు అభిషేక్ శర్మ నెలకొల్పిన 229 పరుగుల రికార్డును అధిగమించాడు. ఫర్హాన్ చివరి మ్యాచ్‌లోనూ 76 పరుగులతో రాణించాడు.అయితే, ఈ మ్యాచ్‌లో శ్రీలంక 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. కుశాల్ మెండిస్ 87 పరుగులతో జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. అయినప్పటికీ పాకిస్థాన్ తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలవడంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది.

# ఫ్లాప్ హీరోపై మళ్లీ 'వందల కోట్లు' నమ్మకం..!



తెల్లని లేస్ కార్సెట్ టాప్ మరియు డెనిమ్ షార్ట్స్‌లో యాషికా ఆనంద్ మెరుపులు





దిశా పటాని గ్లామరస్ లుక్: వైరల్ అవుతున్న లేటెస్ట్ మిర్రర్ సెల్ఫీ

కేజీఎఫ్‌తో పాన్ ఇండియా స్టార్‌గా మారిన యశ్ ఇటీవల 'టాక్సిక్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి తీవ్రంగా నిరాశ పరిచిన విషయం తెల్సిందే. కన్నడ ప్రేక్షకులు మినహా టాక్సిక్ సినిమాను మరే భాష ప్రేక్షకులు చూసేందుకు ఆసక్తి చూపించలేదు. అంతే కాకుండా యశ్ పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దాదాపు రెండేళ్లు వెయిట్ చేసి నువ్వు ఎంపిక చేసుకున్న స్క్రిప్ట్ ఇదా అంటూ యశ్ ను ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేశారు. అంతే కాకుండా దర్శకురాలును కాదని యశ్ సినిమాను తీసినట్లుగా అనిపించిందనే విమర్శలు సైతం వచ్చాయి. కేజీఎఫ్ సినిమా కేవలం ప్రశాంత్ నీల్ వల్ల హిట్ అయింది, కనుక యశ్ మళ్లీ ఆ రేంజ్ సినిమాల కోసం ప్రయత్నాలు చేయక పోవడం మంచిదని కొందరు సలహా ఇచ్చారు. కాస్త కిందికి దిగి యశ్ సినిమాలు చేస్తే బెటర్ అని, లేదంటే కెరీర్ చిక్కుల్లో పడే అవకాశాలు ఉన్నాయంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**యశ్ టాక్సిక్ మూవీ తర్వాత...**

టాక్సిక్ సినిమా ఫలితం తర్వాత కూడా యశ్ మళ్లీ అదే స్థాయి సినిమాను చేయాలని, మళ్లీ కేజీఎఫ్ రేంజ్ హిట్ కొట్టాలని ఆశ పడుతున్నాడు. అందుకోసం స్క్రిప్ట్‌ను చూస్తున్నాడు, ఆ రేంజ్‌లో సినిమాను తీసే వారిని, ఆ స్థాయిలో బడ్జెట్ ఖర్చు చేసే వారిని యశ్ చూస్తున్నట్లు కన్నడ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఫైనల్‌గా యశ్ తో పీఎస్ మిత్రన్ ఒక భారీ సినిమాను చేసేందుకు రెడీ అయ్యాడు. ఆ మధ్య ధనుష్ తో మిత్రన్ అనుకున్న సినిమాను కొన్ని కారణాల వల్ల యశ్ తో చేసేందుకు సంజయ్ లీలా భన్సాలీ రెడీ అయ్యాడని వార్తలు వస్తున్న విషయం తెల్సిందే. అయితే భారీ ఫారెస్ట్ అడ్వెంచర్ మూవీ కావడంతో సినిమాకు వందల కోట్ల బడ్జెట్ ఖర్చు అవుతుందని అంటున్నారు. యశ్ పై ఆ స్థాయిలో ఖర్చు పెట్టడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నారు. యశ్ పై బలమైన కంటెంట్ ఉంటే తప్ప ఖర్చు పెట్టకూడదని విశ్లేషకులు అంటున్నారు.

**సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో...**

సంజయ్ లీలా భన్సాలీ ఈ సినిమాను నిర్మించేందుకు రెడీగా ఉన్నాడు. అయితే యశ్ ను సైతం నిర్మాణ భాగస్వామిగా చేర్చే అంశమై పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పీఎస్ మిత్రన్ హాలీవుడ్ మూవీ ఇండియానా జోన్స్ రేంజ్‌లో ఒక స్క్రిప్ట్ ను రెడీ చేశాడట. విదేశాల్లో ఎక్కువగా షూట్ ఉంటుందని అంటున్నారు. కనుక ఈ సినిమా కచ్చితంగా భారీ బడ్జెట్ మూవీగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. పీఎస్ మిత్రన్ గత చిత్రాల ఫలితాలను చూస్తే ఇప్పుడు ఇలాంటి మూవీ అవసరమా అనే అభిప్రాయం కలుగక మానదు. మిత్రన్, యశ్ కాంబో అంటే కనీసం బజ్ క్రియేట్ అయ్యే పరిస్థితి లేదు. సినిమా మొదలు అయితే ఏమైనా మ్యాజిక్ జరిగి బజ్ క్రియేట్ అవుతుందా అనేది చూడాలి. సాధారణంగా ఒక సినిమా గురించి చిన్న పుకారు వచ్చినా సోషల్ మీడియాలో ఆహా... ఓహో అనే రేంజ్ లో ప్రచారం జరుగుతుంది. కానీ ఈ సినిమా గురించి పెద్దగా పట్టించుకునే వారే లేరు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965